www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 2 నవంబర్ 2023

5

పశ్చిమ గోదావరి

నివాసయోగ్యమైన స్థలాలివ్వాలని నిరసన

పాలకొల్లు: పట్టణంలోని పేదలకు నివాసయోగ్యం కాని ఇళ్ల స్థలాలిచ్చి జగన్ ప్రభుత్వం మోసం చేసినందుకు నిరసనగా పాలకొల్లులో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, లబ్ధిదారులు, టిడిపి శ్రేణులతో కలిసి బుధవారం మహా పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో భాగంగా వినూత్న రీతిలో నిరసన తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ అంబేద్కర్ విగ్రహం నుంచి కొంతేరు, కాజగొప్ప వరకూ 15 కిలోమీటర్ల పొడవున వందల మంది లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఎంఎల్ఎ కలిసి నడుస్తూ నిరసన గళం విప్పి కదం తొక్కారు. ఇళ్ల స్థలాల పట్టాల పేరుతో ప్రభుత్వం మోసం చేసిందని ప్లకార్డులను ప్రదర్శించారు. పట్టణ పరిధిలోని పేదలకు 20 కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలిస్తే చదువులు, జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. పనికిరాని సెంటు స్థలం ఇవ్వడం వల్ల పేదలకు ఉపయోగం లేదన్నారు. పట్టణ పరిధిలోనే సెంటున్నర స్థలం ఇచ్చేవరకూ పోరాడతామన్నారు. ర్యాలీలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కర్నేన గౌరు నాయుడు, కడలి గోపి, కోడి విజయ భాస్కర్, బోనం నాని పాల్గొన్నారు.

జిల్లాలో కరువు లేదంట..!



చాట్రాయి మండలం నరసింహారావుపాలెంలో సాగునీరు లేక ఎండిపోయిన వరి పొలంలో గేదెలను మేపుతున్న రైతు

'కరువు' జాబితాలో ఉమ్మడి జిల్లాలో ఒక్క మండలమూ లేదు

వేలాది ఎకరాల్లో ఎండిన పంటలు

ఏలూరు జిల్లాలో పరిస్థితి దారుణం

వానాకాలం మూడు నెలలూ లోటు వర్షపాతమే

తగ్గిన భూగర్భ జలాలు, అడుగంటిన చెరువులు

ఎండిన పంటల నివేదిక తయారీలో జిల్లా అధికారుల నిర్లక్ష్యం..!

జిల్లా ఊసెత్తని ప్రభుత్వం

లబోదిబోమంటున్న బాధిత రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'వర్షాభావంతో పంటలు దెబ్బతిని కరువు కమ్ముకొచ్చినా ప్రభుత్వంలో చలనం లేదు.. ఉమ్మడి జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా గుర్తించలేదు.. అసలు జిల్లా ఊసే ప్రభుత్వానికి లేకుండా పోయింది.. దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి పంపించే ఆలోచన కూడా అధికారులు చేయలేకపోయారు. మూడు నెలల వర్షపాతం లోటు ఏర్పడి నీటిఎద్దడి సమస్యతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నప్పటికీ అధికారులకు, ప్రభుత్వానికి కనిపించకపోవడం దారుణం..' అంటూ ఉమ్మడి జిల్లా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్రంలో 103 మండలాలను కరువు మండలాలుగా ఈనెల 30వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన లెక్కలన్నీ తప్పుల తడకలన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కరువును తగ్గించి చూపేందుకు కరువు విలయతాండవం చేస్తున్న మండలాలను సైతం చేర్చలేదన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో పలుమండలాల్లో కరువు విలయతాండవం చేస్తున్నా ప్రభుత్వ జాబితాలో కనిపించకపోవడం వెనుక అధికారుల తప్పిదమా.. లేక ప్రభుత్వ నిర్లక్ష్యమా అన్న ప్రశ్నలు జిల్లావాసులను తొలిచేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం నాలుగు నెలల్లో జూలై నెల మినహా జూన్, ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలల్లో జిల్లాలో సరైన వర్షాలే పడలేదు. జూన్‌లో 112.5 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 86.3 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. మైనస్ 23.3 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో 212.4 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 90.9 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఏకంగా మైనస్ 57.2 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఏర్పడింది. ఇక వర్షాకాలం ఆఖరునెల సెప్టెంబర్‌లోనూ 171.5 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం పడాల్సి ఉండగా కేవలం 137 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. మైనస్ 20.1 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఉంది. ఈ ఏడాది పెద్దఎత్తున వర్షపాతం లోటు ఏర్పడి నీటి ఎద్దడి సమస్య రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

డెల్టాలోనూ సాగునీటి కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఏలూరు జిల్లా మెట్టప్రాంతంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారింది. చెరువులు అడుగంటాయి. బోర్ల నుంచి వచ్చే నీళ్లు తగ్గిపోయాయి. రోజంతా మోటారు ఆడించినా ఎకరం కూడా తడవడం లేదు. చింతలపూడి మండలంలో ఏకంగా ఐదువేలకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. చాట్రాయి మండలంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ముసునూరు మండలంలోనూ సాగునీటి సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్వారకాతిరుమల, కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లోనూ పరిస్థితి దారుణంగా మారింది. పొలాల్లో మోటార్ సైకిళ్ల నడిచేలా భూములు నెర్రలు తీశాయి. నీరులేక ఎండిపోయిన పంటలు పశువుల మేతగా మారిపోయాయి. రైతులు ఎకరాకు రూ.25 వేలకుపైగా నష్టపోయారు. పలు మండలాల్లో పత్తిపంట సైతం దెబ్బతింది. పశువులకు తాగునీరు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటిస్తుందని, దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. కరువు మండలాల జాబితాలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క మండలం కూడా లేకుండా పోయింది. దీంతో పంటలు దెబ్బతిన్న రైతుల పరిస్థితి ఏమిటంటూ రైతుసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఈ విధంగా గాలికొదిలేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని అధికారులు నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణమన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతోంది. దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సైతం అధికారులు శ్రద్ధ చూపలేదు. నేడు ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితా సైతం దాన్నే ధృవీకరిస్తోంది. ఉసూరుమంటున్న రైతులను ఎవరు ఆదుకుంటారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది.

నాలుగునెలల వర్షపాతం వివరాలు

నెల	కురిసిన వర్షం(మిల్లీ మీటర్లలో)	కురవాల్సింది	కురిసింది
జూన్	86.3	112.5	-23.3
జులై	319.8	242.9	ప్లస్31.7
ఆగస్టు	90.9	212.4	-57.2
సెప్టెంబర్	137	171.5	-20.1

భీమవరంలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఘాటుగా విమర్శించారు. తాడేపల్లిగూడెంలో వాసవి కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి మంత్రి కొట్టు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములుకు తెలుగుజాతి యావత్తూ రుణపడి ఉంటుందన్నారు. ఆయన ప్రాణ త్యాగం చేసి సాధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కూడా మార్చేసిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. అమర జీవి త్యాగనిరతిని గాలికొదిలేసి రాష్ట్రం రెండు ముక్కలైపోవడానికి చంద్రబాబు కారకుడయ్యాడన్నారు. టిడిపి నాయకులకు ఎంతసేపు కేసుల నుంచి ఎలా బయటపడాలని ఆలోచన తప్ప ప్రజల గురించి ఆలోచించే సమయం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, సిజిఎఫ్ కమిటీ మెంబర్ కర్రి భాస్కరరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవల్లి చెన్నా నాగేంద్రరావు పాల్గొన్నారు.



గూడంలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొట్టు



నరసాపురం టౌన్ : శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్

భీమవరం : తెలుగు రాష్ట్రాల ఆర్థిక ప్రగతికి, పురోభివృద్ధికి స్వతంత్ర బాటలు వేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు కలెక్టరేట్ ఆవరణలో బుధవారం జరిగింది. తొలుత కలెక్టర్ పి.ప్రశాంతి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగఫలితమే భాష ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందన్నారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలందించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథం వైపు పయనిస్తోందన్నారు. జెసి రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి మృతి చెందడంతో ప్రత్యేక తెలుగురాష్ట్రం ఉద్యమం తీవ్రతరం అవడంతో ప్రత్యేక తెలుగు రాష్ట్రానికి 1953లో చట్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా ఎఎస్‌పి ఎవి సుబ్బరాజు, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ అన్నారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం ఫలంతో పాటు అనేకమంది పోరాట ఫలితంగా ఏర్పాటైన రాష్ట్రం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ముందుకు సిపిఎం ప్రత్యేక ప్రజా ప్రణాళిక

జిల్లాలో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రజా రక్షణ భేరి యాత్ర

3వ తేదీ నుంచి జిల్లా జాతాలు ప్రారంభం

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు అన్ని వర్గాల ప్రజలూ అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఈ నేపథ్యంలో సిపిఎం ప్రత్యేక ప్రజా ప్రణాళిక రూపొందించి ప్రజల ముందుకు తెచ్చిందని పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజా రక్షణ భేరి యాత్రకు సంబంధించి వివరాలను బలరాం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తోందన్నారు. నిత్యావసర ధరల అదుపులో కేంద్రం విఫలమైందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు కూలీలుగా మారారన్నారు. ప్రభుత్వ ఆస్తులను, సంస్థలను కారు చౌకగా అమ్మకాలు చేపట్టిందని, ఈ విధానాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, పోలవరం ప్రాజెక్టు నిధి లేకుండా గాలికి వదిలేసిందని అన్నారు. ప్రజా సంఘాలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ముందుకొస్తే సెక్షన్ 144, సెక్షన్లు 30 యాక్ట్ విధించి గృహ నిర్బంధాలు చేస్తున్నారన్నారు. దీనిపై కోర్టు, ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. దళితులు, మహిళలపై దాడులు పెరిగిపోయాయని, వాటిని అదుపు చేయడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. పంటలకు మద్దతు ధర ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేల నుండి రూ.5 వేల పెంచాలన్నారు. రూపాయికి విద్యుత్ యూనిట్ అందించాలని, 300 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని స్మార్ట్ మీటర్లు ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రూ.400కు గ్యాస్ రూ.60కి పెట్రోల్, డీజిల్, ఉచితంగా ఇసుక అందించాలన్నారు. ఈ నెల 8న ప్రజా రక్షణ భేరి రాష్ట్ర యాత్ర జిల్లాకు రానుందన్నారు. మూడు రోజులు పాటు ఈ యాత్ర జిల్లాలో పర్యటించనుందన్నారు. ఈ నెల 3న ఆకివీడు, తాడేపల్లిగూడెం నుంచి రెండు జిల్లా జాతాలు ప్రారంభించనున్నమన్నారు. ఏడు నియోజకవర్గాల్లో ఈ జాతాలు ప్రచారం చేయనున్నాయని చెప్పారు. నియోజకవర్గ కేంద్రాల్లో సభలు ఏర్పాటు చేయనున్నామని, ఈనెల 15న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు. ఈ ధర్నాకు ఆల్ ఇండియా నాయకులు పి.మధు, వెంకట్, వి.శ్రీనివాసరావు, ధనలక్ష్మి, అగ్ర నేతలు హాజరుకానున్నారని చెప్పారు. ధర్నాలో అంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పనుల్లేక పస్తులుంటున్నారన్నారు. ఆక్వా, వ్యవసాయ రంగం దెబ్బతిన్నాయని, మహిళలు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇతర దేశాలకు వలసలు వెళుతున్నారన్నారు. జిల్లాలో కాలుష్యం బాగా పెరిగిందని, దీంతో తాగునీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వైద్యం, ఉపాధి, తాగునీరు ప్రజలందరికీ అందించాలని జాతాల్లో చాటి చెప్పడం జరుగుతుందన్నారు. జిల్లా జాతాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బలరాం

ఎండుతున్న పొలాలకు నీరివ్వండి

కౌలు రైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - యలమంచిలి

పంట కాలువలను ప్రభుత్వం ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా వదిలేయడంతో జిల్లాలో సార్వాకు సాగునీరందక రైతులు ఆందోళన చెందుతున్నారని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని కాంబోట్లపాలెం, గుంపర్రు గ్రామాల్లో ఎండుతున్న పంటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలువలను ప్రభుత్వం ఏళ్ల తరబడి వదిలేయడంతో కాలువల్లో పిచ్చి పొదలు అల్లుకుని అడవులను తలపిస్తున్నాయన్నారు. పొట్టదశలో నీరందకపోవడంతో పంట నష్టం తీవ్రంగా ఉంటుందని, ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టామని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వందలాది ఎకరాల్లో ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. సమస్యను ఇరిగేషన్ డిఇ ఎస్‌వివి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన ఆయన వెంటనే ఇరిగేషన్ ఎఇ కె.శ్రీనివాసును సమస్య పరిష్కరించాలని ఆదేశించారని తెలిపారు. రైతులవద్దకు చేరుకున్న ఎఇ, సంబంధిత అధికారులు పిఎస్.దొర, కె.జగన్నాధరాజు సమస్యను పరిశీలించి వెంటనే సాగునీరందిస్తామని, కాలువను ఆధునికీకరించేందుకు తక్షణం నిధులు కేటాయించి పనులు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు బండి వెంకటేశ్వరరావు, గాజులపాటి వెంకటరత్నం, బెజవాడ రాజేంద్రప్రసాద్ ప్రసాద్, బండి సూర్యనారాయణ, పెచ్చెట్టి వెంకటేశ్వర్లు, బండి రామకృష్ణ, కేతా మురళీ పాల్గొన్నారు.

ఎండిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

క్రీడల పట్ల గ్రామీణ యువతీ, యువకులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. డిసెంబరు 11వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకూ రాష్ట్ర మంతటా ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహించనున్నారని, జిల్లాలో అన్ని ఏర్పాట్లూ చేసినట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన స్పోర్ట్స్ కిట్లను ఉభయ గోదావరి జిల్లాల సెట్వెల్, స్పోర్ట్స్ సిఇఒ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, యువత క్రీడలను ప్రోత్సహించడానికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విస్తృతంగా ఆటలు పోటీల కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో డిసెంబరు 11వ తేదీ నుంచి 408 గ్రామ సచివాలయాలు, 127 వార్డు సచివాలయం పరిధిలో పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల సెట్వెల్ స్పోర్ట్స్ సిఇఒ ఎండిహెచ్ మెహరాజ్, జిల్లా డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

న్యాయం చేయాలని బ్యాంకు వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఉండి

ఉండి విశాల సహకార పరపతి బ్యాంకులో 40 ఏళ్లుగా ఉద్యోగం చేస్తూ బ్యాంకునే దోచేసిన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుని, రైతులు, ఖాతాదారులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఉండి విశాల సహకార పరపతి సంఘం ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. అనంతరం విచారణ అధికారి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతకాయల బాబూరావు, ఆకుల హరేరామ్ మాట్లాడుతూ రైతు సంఘం మండల అధ్యక్షులు దండు రామలింగరాజు బృందం ఉప్పులూరు, కోలమూరు, పాందువ్వ, ఆరేడు, కలిగొట్ల గ్రామాల్లో రెండు రోజులుగా పర్యటించి రైతులను కలిసి వారికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్నట్లు తెలిపారు. సహకార బ్యాంకులో సుమారు 7000 మంది రైతులు ఉన్నారని, వారిని విచారించడానికి రెండు నెలలుపైగా పడుతుందని తెలిపారు. ప్రస్తుతం సుమారు 35 మంది రైతుల సొమ్ము రూ.63 లక్షల నగదు, ఏడుగురు రైతుల బంగారం కనబడడం లేదని ప్రాథమిక విచారణలో తేలిందని విచారణ అధికారి తమకు తెలిపారని, ఏడు వేల మందికి నోటీసు ఇవ్వడం సరికాదని తెలిపారు. గ్రామాల్లో టామ్ టామ్ వేయించి రోజూ ఒక గ్రామం నుండి లబ్ధిదారులను విచారించి వారి ఖాతా నిల్వలు తేల్చాలని, రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పాలమూరు రైతు పేరిచర్ల వెంకటేశ్వరరాజు ఖాతాలోని 2 లక్షల రూపాయల నగదు అపహరణకు గురైనట్లు వారు విచారణ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు న్యాయం చేసే వరకూ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పేరిచర్ల వెంకటేశ్వరరాజు, పేరిచర్ల రంగరాజు, పేరిచర్ల గోపాలకృష్ణంరాజు, దండు రామకృష్ణ, భగవాన్ రాజు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

రైతులు, ఖాతాదారులు అధైర్యపడొద్దు

సొసైటీ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు

ఉండి : ఉండి విశాల సహకార పరపతి సంఘం రైతులు, ఖాతాదారులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని బ్యాంకు ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజు అన్నారు. బుధవారం సాయంత్రం సహకార బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యనారాయణరాజు మాట్లాడారు. 2010 నుంచి నేటి వరకూ సుమారు 80 శాతం బ్యాంకుకు తిరిగి కట్టాల్సిన నగదు చెల్లింపులు నిలిచిపోవడంతో వాటిని వసూలు చేసే క్రమంలో బ్యాంకులో జరిగిన అవకతవకలు విషయం బయటపడిందని తెలిపారు. వెంటనే విచారణ ప్రారంభించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంట్లో సుమారు 60 శాతం వసూలు చేశామని, డిపాజిటర్లు, ఖాతాదారులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు, రైతులు తమను సంప్రదించారని, వారికి భరోసా ఇచ్చామని తెలిపారు. వారి సొమ్ము ఎక్కడికీ పోలేదని తెలిపారు. అవకతవకలు జరిపిన ఉండి బ్యాంకు కార్యదర్శి గంగమోలు ప్రసాద్, కోలమూరు బ్యాంకు మేనేజర్ పైలా దుర్గారావును విధుల నుంచి తప్పించి ఉండి సహకార బ్యాంకు కార్యదర్శిగా బగాది శ్రీనివాస్, కోలమూరు బ్యాంక్ మేనేజర్‌గా నాగేశ్వరరావు, సహాయకుడిగా ప్రభాకర్‌రావును నియమించినట్లు తెలిపారు. నిందితుల స్థిర ఆస్తులను త్వరలోనే జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యుడు కరిమెరక శివ నాగరాజు పాల్గొన్నారు.

సాగులో నూతన కల్పనలపై సెమినార్

ఆక్వా ఎక్స్ ఇండియా సిఇఒ వేణు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 2, 3, 4 తేదీల్లో పెదఅమిరంలోని ఆర్‌కె కన్వెషన్ హాల్లో ఆక్వా ఎక్స్ ఇండియా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆక్వా ఎక్స్ ఇండియా సిఇఒ దంతులూరి వేణు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాస్ రాజు తెలిపారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చేపలు, ఆక్వాకల్చర్ ఉత్పత్తులు రెండింటిలోనూ చైనా తర్వాత రెండో స్థానంలో భారతదేశం ఉందని తెలిపారు. 2021-22 మధ్య కాలంలో 115 దేశాలకు భారీ అసమానతలు ఉన్నప్పటికీ, భారతదేశం రూ.57,586.48 కోట్ల విలువైన సముద్ర ఆహారాన్ని రవాణా చేసిందన్నారు. సాగులో నూతన కల్పనలే సెమినార్ ఉద్దేశమని, 2018 -19లో హైదరాబాద్‌లోనూ, 2020-22లో భీమవరంలో సెమినార్ నిర్వహించామని తెలిపారు. సమావేశంలో సిఫా వైస్ ప్రెసిడెంట్ సికె.మూర్తి, ఆక్వా ఎక్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ పాత్ర, విశ్వనాధరాజు పాల్గొన్నారు.

'దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు మోడీ యత్నం'

ప్రజాశక్తి - తణుకు రూరల్

కుల, మతం పేరుతో దేశ సమగ్రతను దెబ్బతీయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం వేల్పూరులోని పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో యూనియన్ అధ్యక్షులు యర్ర మల్లికార్జునరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ప్రజా రక్షణ భేరి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగిపోయిందన్నారు. దశాబ్దాలుగా పోరాడి ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసి లేబర్ కోడ్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ఈ నెల 15వ తేదీన విజయవాడలో సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వాటాల నాగేశ్వరరావు, యాతం పెద్దరాజు, ఆనందం గంగాధరరావు, యాతం శ్రీను, దున్నే రుద్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఏర్పాటుచేసిన జిల్లా సర్వే శాఖ డేటా ప్రాసెసింగ్ సెంటర్ నూతన కార్యాలయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే రికార్డులను అత్యంత వేగవంతంగా చేయడానికి ఈ నూతన కార్యాలయాన్ని ఉపయోగించనున్నట్లు తెలిపారు. డేటా ప్రాసెసింగ్ సెంటర్‌కు 20 మంది సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించామని, పనులు వేగవంతం చేసి మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు. అత్యాధునికమైన కంప్యూటర్లను ఏర్పాటు చేసి రికార్డులు వేగవంతం చేసి, మూడో దశ రీ సర్వే పనులు నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత మాధుర్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె.మల్లికార్జునరావు, డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక దళ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ డిఇ బి.పిచ్చియ్య, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఎఒ ప్రశాంత్ అప్పారావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రవాణా ట్రాక్టర్లకు జియో ట్యాగ్

ప్రజాశక్తి - పెనుమంట్ర

జియో ట్యాగ్ చేసిన ట్రాక్టర్లు మాత్రమే ధాన్యం కొనుగోలుకు ఉపయోగించాలని తహశీల్దార్ దండు అశోక్ వర్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణ వద్ద వ్యవసాయ శాఖ, రెవెన్యూ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ట్రాక్టర్లకు జియో ట్యాగిను అమర్చారు. ఈ సందర్భంగా అశోక్‌వర్మ మాట్లాడుతూ ప్రతి ధాన్యం పిరీన ట్రాక్టర్‌పై ధాన్యం రవాణా చేసే ట్రాక్టర్ యాజమాన్యం ఆధార్ కార్డు, ఆర్‌సి, బ్యాంక్ అకౌంట్, పాన్‌కార్డు, ఫోన్ నెంబర్ ఇవ్వడం ద్వారా జియో ట్యాగ్ అమర్చనున్నట్లు తెలిపారు. దీనికి రూ.2800 రుసుం అవుతుందని, ఆలస్యమైతే రూ.500 అదనంగా చెల్లించల్సి ఉంటుందని చెప్పారు. తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ టెక్నీషియన్ బి.త్రినాథ్ ద్వారా అమర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎ.జ్యోతి, ఎఇఒ సత్యనారాయణ, ఆర్‌ఐ సుబ్బారావు, విఆర్‌ఒ రాజు, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆర్గానిక్ కూరగాయల వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు ఉండవని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. వెలగలగా కార్యాలయం ఆవరణ వద్ద ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పండించిన ఉత్పాదనలు బుధవారం ఎంపిడిఒ చేతులమీదుగా వ్యాపారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.పద్మజ మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు పిచికారి చేయకుండా పెంచుకున్న కూరగాయల వంటలకు వాడుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉండవన్నారు. ఇకపై ప్రతి వారం స్టాల్ ఏర్పాటు చేస్తామని వ్యవసాయ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.అరుణకుమారి అన్నారు. రైతులకు, మహిళ లకు అందుబాటులో ఉండే విధంగా ధరలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజన్ కో-ఆర్డినేటర్ (ఎన్‌ఎఫ్‌ఎ) ఎం.అరుణ కుమారి, మండల ఇన్‌ఛార్జి ఇళ్ల శ్రీనివాసరావు, ఎఓటిఆర్‌ఎస్ కె.సుందరయ్య, వి.సుబ్బలక్ష్మి, బి.రాజీ, పి.శాంతి, జె.నాగరాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'మానవత' పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెగ్గిపూడి గ్రామానికి చెందిన బోడపాటి సోమేశ్వరరావు మాస్టారు కుమారుడు బోడపాటి హేమంత్‌సాయిప్రశాంత్ (21) గత నెల 13వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబాన్ని మార్టేరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆత్మీయ సహకార కమిటీ బుధవారం పరామర్శించి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మానవత ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, చైర్మన్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పడాల జగన్మోహన్‌రెడ్డి, ఇసి హెల్త్ పడాల రామచంద్రారెడ్డి, పూర్వ ప్రెసిడెంట్ కడలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని డిసిసిబి చైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని జువ్వలపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పద్మిశెట్టి సోమేశ్వరరావు, ఎంపిపి పెన్మెత్స విష్ణుదేవరాజు, గ్రామ సర్పంచి మీసాల రమణ ,ఉప సర్పంచి కలిదిండి లక్ష్మీపతి రాజు, ఎంపిటిసి సభ్యులు మీసాల శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు గుబ్బల బెనహర్, వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ రుద్రరాజు రామకృష్ణంరాజు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు కార్యాచరణ

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని 15 గ్రామాల్లోని ధాన్యం కొనుగోలుకు ముందస్తు కార్యాచరణ నిమిత్తం మండల వ్యవసాయ అధికారులతో రైస్ మిల్లర్స్ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.సృజన మాట్లాడుతూ ధాన్యం సేకరణకు ఉపయోగించే ప్రతి వాహనానికి జిపిఎస్ ఉపకరణ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 2, 3 తేదీల్లో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ జిపిఎస్ ఉపకరణాలను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ అధికారి సంజయ్‌కుమార్, ఎంపిడిఒ శ్రీనివాస్ దొర, తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని వినియోగించుకోండి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే గ్రామాల్లో కూలీలకు ఉపాధి లభించడంతో పాటు మరింత అభివృద్ధి చేసుకోవచ్చని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సోషలేడిట్ గ్రామ సభలో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పి మన్మధరావు, డిఆర్‌పి సత్యనారాయణ మాట్లాడుతూ మునిగిన ఆర్థిక సంవత్సరంలో మొగల్తూరు పంచాయతీ పరిధిలో 222 పనులు పూర్తి చేశామని, రూ.52,46,400 నిధులు వెచ్చించినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో 550 మందికి ఏడాదికి వంద రోజులు పనిదినాలు కల్పించామన్నారు. పూర్తి చేసిన పనుల వివరాలను గ్రామ సభలో వివరించారు. గృహాలు నిర్మించుకునే వారికి ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ వై.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ జె.వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి బోణం నరసింహరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రం కోసం అమరణ నిరాహారదీక్షతో ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు సిపిఎం జిల్లా కమిటీ నివాళి అర్పించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం, కమ్యూనిస్టుల పోరాటం తొలి భాషాప్రయుక్త రాష్ట్ర ఏర్పాటుకు నాంది పలికిందన్నారు. అనంతపురం జిల్లాలో పేదల గుడిసెల కాల్చివేతను, సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.రాంభూపాల్‌ను స్థానిక సిఐ తీవ్రంగా కొట్టి బూతులు తిట్టడాన్ని బలరాం తీవ్రంగా ఖండించారు. పేదలకు ఇళ్ల నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ పేదల ఇళ్లనే దుర్మార్గంగా కాల్చివేసే ప్రభుత్వం బడాబాబులు, రియల్ ఎస్టేటుదారుల దౌర్జన్యాలకు కొమ్ము కాయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ చర్యలను అందరు ఖండించాలని పిలుపునిచ్చారు.

గణపవరం : తెలుగువారికి రాష్ట్ర సాధనలో తన ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు ధన్యజీవి అని గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలుగు తల్లికి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్లే నాడు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జ్యోతి, ఇఒపిఆర్‌డి విజయసారథి, కార్యాలయం సూపరింటెండెంట్ అప్పారావు, వీరవల్లి చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తృణప్రాయంగా రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా స్థానిక మెయిన్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మండలంలోని అజ్జమూరు గ్రామంలో ఉన్న ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.నారాయణ విద్యార్థులకు పొట్టి శ్రీరాములు త్యాగశీలతను రాష్ట్ర అవతరణను వివరించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

6న విజయభేరి వాహనం ప్రారంభం

తారకరామ కన్‌స్ట్రక్షన్స్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పళ్ల తారకరామనంద

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తారకరామ కన్‌స్ట్రక్షన్స్ వైస్ ఛైర్మన్‌గా పళ్ల తారకరామ నంద బాధ్యతలు చేపట్టినట్లు ఛైర్మన్ పళ్ల ఏసుబాబు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వైస్ ఛైర్మన్ తారక రామనంద మాట్లాడుతూ విస్సాకోడేరు జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలు జరుపుకుంటున్నారని, పట్టణంలో మిగిలిన లబ్ధిదారులకు గృహ నిర్మాణలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా తమ కన్‌స్ట్రక్షన్ తరపున రూ.15 లక్షలతో ఏర్పాటుచేసిన విజయభేరి వాహనాన్ని తయారు చేశామని తెలిపారు. ప్రతి వార్డులో కూడా ఈ వాహనాన్ని హౌసింగ్ లబ్ధిదారుల అవగాహన కోసం

వాహనం వద్ద ఛైర్మన్, వైస్‌ఛైర్మన్

వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ చేతులమీదుగా ఈ నెల 6న ఈ విజయభేరి వాహనాన్ని ప్రారంభిస్తామన్నారు. కాలనీలో గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు రవాణా ఛార్జీలు లేకుండా తాము ఏర్పాటు చేసిన వాహనం ద్వారా వారికి పట్టణం నుంచి ఈ లేఅవుట్ వరకు రవాణా సదుపాయాన్ని ఉచితంగా కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలు 10,331 ఉండగా, తమ కన్‌స్ట్రక్షన్ ఏడో స్థానంలో ఉందన్నారు. విస్సాకోడేరు లే అవుట్‌లో 4,600 గృహాలకు సంబంధించి రెండు వేల గృహ నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. తాను వైజాగ్ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ చేశానని, ప్రస్తుతం ఆర్గానిక్ ఫుడ్‌పై బెంగుళూరులో రీసెర్చ్ చేస్తున్నానని, త్వరలో పౌల్ట్రీ, డైరీ, వాటర్ రంగంలో కాలుష్య రహిత పరిశ్రమలోకి తమ తారకరామ కన్‌స్ట్రక్షన్ అడుగు పెడుతుందని రామానంద తెలిపారు.

సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యం : పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఒ.హెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణం, జిఎన్‌వి కెనాల్ నుంచి మంచినీటి చెరువు వరకు రెండున్నర కిలోమీటర్లు పొడవునా వాటర్ పైపులైన్, మైక్రో ఫిల్టర్ బెడ్, అంతర్గత పైపులైన్ మరమ్మతులు, 200 కుళాయి కనెక్షన్లు మంజూరు నిమిత్తం గొరగనముడి గ్రామానికి రూ.కోటి మంజూరైంది. దీనిలో భాగంగా వీటి నిర్మాణానికి బుధవారం సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) ఆధ్వర్యంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటి రాజు)తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి పథకాల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. గొరగనముడి గ్రామంలో ఈ నిర్మాణాలతో గ్రామస్తులకు పూర్తిస్థాయిలో సురక్షితమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివాజీ రాజు , ఉప సర్పంచి గూడూరి రామాంజనేయులు, విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్, మాజీ సర్పంచులు చెల్లబోయిన పాపారావు, పెనుమస శ్రీనివాసరాజు, నాయకులు దిడ్ల రవి, దుండి అశోక్‌బాబు, మల్లుల శ్రీను, జానకి, పొన్నమండ బాలకృష్ణ, పరమేశ్వరరావు, గడ్డం జోషి, పాల రాధాకృష్ణ, ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు

భీమవరం :జిల్లాలో ధాన్యం సేకరణకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణపై సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చే వారంలో ధాన్యం పంట రైతు చేతికి వస్తుందని ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాల న్నారు. దీనికి అనుగుణంగా జిల్లా రైస్‌మిలర్లు అన్ని ఏర్పా ట్లు చేసుకోవాలన్నారు. మిల్లర్లు అవసరమైన గోనెసంచులు, బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాల్సిందిగా ఆదేశిం చారు. గత రబీ పంట కాలంలో మిల్లర్లు ఇంకా కస్టమ్ మిలింగు రైస్ సుమారుగా 52 వేల మెట్రిక్ టన్నులు ప్రభు త్వానికి ఇవ్వా ల్సి ఉందని, వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేం ేజర్ టి.శివరామప్రసాద్, ఎఎస్ఒ ఎం రవిశంకర్, జిల్లా రైస్‌మి ల్లర్స్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్‌టిసి బస్సులో వృద్ధురాలు మృతి

పాలకోడేరు :ఆర్‌టిసి బస్సులో వివాహ శుభకార్యానికి వెళ్తున్న ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... మండలంలోని వెలివర్రు గ్రామానికి చెందిన కవిటపు విజయభారతి (60) ఓ వివాహానికి వెళ్లేందుకు బుధవారం రాత్రి ఆర్‌టిసి బస్సులో బయలుదేరింది. వెలువర్రు నుంచి భీమవరం వచ్చిన ఆమె భీమవరం నుంచి రాజమండ్రి వెళ్లే ఆర్‌టిసి బస్సులో పొలమూరులో జరిగే వివాహానికి బయలు దేరింది. ఆర్‌టిసి బస్సు పెన్నాడ సమీపనికి వచ్చేసరికి భారతికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. బస్సులోని ప్రయాణికులు బస్సును ఆపి ఆమెను పరిశీలించారు. అప్పటికే ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సంఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ నాలం శ్రీనివాస్ తెలిపారు.

సినీ ఫక్కీలో చోరీ

రూ.6.50 లక్షలు అపహరించుకుపోయిన వైనం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం పట్టణం జోస్యులవారివీధిలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బజార్ బ్రాంచిలో ఓ అగంతకుడు సినీ ఫక్కీలో బ్యాంకు సొమ్మును లూటి చేశాడు. ఎవరూ లేని సమయంలో క్యాషియర్ కౌంటర్ వద్దకు వెళ్లి లోను కోసం వచ్చానని చెబుతూ వెంట తీసుకొచ్చిన బ్యాగ్‌లో నుంచి పొడువాటి కత్తితో బెదిరించి రూ 6.50లక్షలు పట్టుకుని పారిపోయాడు. వివరాల ప్రకారం.. జన సంచారం అంతంత మాత్రంగా ఉండే బ్యాంకుపై కన్నేసిన అగంతకుడు బుధవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బ్యాంకులో చొరబడ్డాడు. టోపీ పెట్టుకుని మాస్క్ ధరించి బ్యాగ్ పట్టుకుని క్యాషియర్ కనకదుర్గ వద్దకు వెళ్లి గోల్డ్ లోన్ కోసం వచ్చానన్నాడు. మాస్క్ తీసి మాట్లాడు అని చెప్పిన క్యాషియర్‌కు తనకు అనారోగ్యం చేసిందని మాస్క్ తీయలేనని చెబుతూ అతని వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లో నుంచి పొడవాటి కత్తి తీసి బెదిరించి టేబుల్‌పై ఉన్న రూ.7.50 లక్షలు నగదును బ్యాగ్‌లో వేసుకుని ఉడాయించాడు. బ్యాంకు సిబ్బంది కేకలు వేయడంతో పరుగు తీసిన ఆగంతకుడి నుంచి రూ.లక్ష బ్యాంకులో పడ్డాయి. మిగతా రూ 6.50 లక్షలతో పరారయ్యాడు. విషయం తెలుసుకున్న మెయిన్ బ్యాంకు మేనేజర్, బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐలు బ్యాంకుకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరం పై దాడి

ఉండి :మండలంలోని పాములపర్రు శివారు కొండగూడెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1800 నగదును, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కె.గంగాధరరావు తెలిపారు.

పాలస్తీనా-ఇజ్రాయేలు మధ్య యుద్ధం ఆందోళనకరం



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి పి.దక్షిణామూర్తి

ప్రజాశక్తి - తణుకు రూరల్

పాలస్తీనా-ఇజ్రాయేలు మధ్య జరుగుతున్న యుద్ధం మహిళలు, చిన్నారులు, సాధారణ ప్రజల మరణాలకు దారితీయడం ఆందోళన కలిగించే విషయమని ప్రముఖ సామాజికవేత్త డివివిఎస్.వర్మ అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయేలు జరుపుతున్న యుద్ధాన్ని వ్యతిరేకిద్దామని తణుకు స్టడీ సర్కిల్, సామాజిక న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్ అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఈ యుద్ధాన్ని ఇప్పటికే ప్రచారంలో ఉన్న అంశాలపై కాకుండా మరింత సునిశితంగా పరిశీలించాలన్నారు. గాజాపై ఇజ్రాయేలు ప్రతిరోజూ బాంబు దాడులతో విరుచుకుపడుతుందని, వేలాది మంది మహిళలను, చిన్నారులను బలి తీసుకుంటున్న విషయం చూస్తూనే ఉన్నామని, మరోవైపు సామ్రాజ్యవాద శక్తులన్నీ ఏకమై ఇజ్రాయేలు పక్షం వహించి పాలస్తీనా అరబ్ జాతిని అంతమొందించే దిశగా యుద్ధాన్ని ఎగదోయడాన్ని ప్రజాస్వామికవాదులంతా ఖండించి పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని సమర్ధించాలని వర్మ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సిఐటియు జిల్లా కార్యదర్శి దక్షిణామూర్తి, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కౌరు వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ నీలం మాల్యాద్రి, సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షులు గొల్లపల్లి అంబేద్కర్, దళిత నేత గొల్లపల్లి వివేకానంద, న్యాయవాది పొట్ల సురేష్, విద్యార్థి నాయకులు శ్యామ్, మణిబాబు, కార్యకర్తలు గుండే శేఖర్, మెడికల్ రిప్రెజెంటెటివ్ శివ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణంరాజు పుట్టినరోజు వేడుకలు


పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం గ్రామానికి చెందిన వైసిపి ముఖ్య నేత, గ్రామ పెద్ద కలిదిండి కృష్ణంరాజు (బుజ్జి) పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాజకీయలు, పార్టీలు, కుల మతాలకు కతీతంగా నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ అధికారులు తరలివచ్చారు. కృష్ణంరాజుకు పుష్పగుచ్ఛాలు పూలమాలలు వేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కృష్ణంరాజు కట్ చేసి కేక్‌ను పంచిపెట్టారు. వృద్ధులకు, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంగం సూరిబాబు, ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు, సొసైటీ అధ్యక్షులు వీరవల్లి లక్ష్మణరావు, ఉప ఎంపిపి శోడదాసి నరేష్, ఎంపిటిసి సభ్యులు మల్లుల సూర్యకళ, కో-ఆప్షన్ సభ్యురాలు స్వర్ణలత, సొసైటీ మాజీ ఛైర్మన్ బ్యాంకు బుజ్జి, నాయకులు బుంగ రమణబాబు, మంద ప్రవీణ్, దుర్గ, మంద ప్రభుదాస్, సాబత్తుల రవి, సురేష్ పాల్గొన్నారు.

గరగపర్రు వంతెనపై ఇరుక్కున్న కంటైనర్

ఆరు గంటలపాటు నిలిచిపోయిన ట్రాఫిక్

దెబ్బతిన్న వంతెన రైలింగ్

పాలకోడేరు :నిత్యం వాహనదారులతో రద్దీగా ఉండే భీమవరం-తాడేపల్లిగూడెం మార్గంలో గరగపర్రు వంతెన టర్నింగ్‌లో ఓ కార్ల కంటైనర్ ఇరుక్కుంది. ఈ వంతెన ప్రాంతంలో బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో కంటైనర్ నిలిచిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే భారీ వాహనాలు, ఆర్‌టిసి బస్సులు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వెనుతిరిగి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో కూడా ఇలాగే ఈ కార్ల కంటైనర్ ఇరుక్కోవడంతో ఈ మార్గంలో వీటిని తీసుకురావద్దంటూ స్థానికులు, అధికారులు హెచ్చరించినా ఈ హెచ్చరికలు తమకు పట్టవంటూ తిరిగి ఇదే మార్గంలో ప్రయాణించడంతో ప్రస్తుతం ఈ పరిస్థితి నెలకొంది. తాడేపల్లిగూడెం హైవే నుంచి గరగపర్రు మీదుగా భీమవరంలోని రెడ్డి అండ్ రెడ్డి కార్ల కంపెనీకి వెళ్లాల్సిన కంటైనర్ గరగపర్రు వద్ద ఇరుక్కోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. కార్ల కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడంతో సుమారు ఆరు గంటల పాటు ఈ మార్గంలో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. స్థానికుల నుంచి వాహనదారుల నుంచి ఫిర్యాదులు వెలువెత్తడంతో సాయంత్రం యంత్రాలను తీసుకొచ్చి కంటైనర్‌ను వంతెన మలుపు ప్రాంతం తప్పించి ముందుకు తీసుకెళ్లారు. ఈ సమయంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పనులను పర్యవేక్షించారు. కంటైనర్ తొలగింపు సమయంలో వంతెన రైలింగ్ కొంత దూరం పూర్తిగా దెబ్బతింది. తరచూ ఈ కంటైనర్ లారీల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవ్వడంతో పాటు రూ.కోట్ల విలువైన వంతెన ప్రమాద అంచుకు చేరుతుందని వీటిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు,కోరుతున్నారు.

NOTICE

BEFORE THE MOTOR VEHICLES ACCIDENTS CLAIMS TRIBUNAL: IV ADD'S DISTRICT JUDGE : TANUKU.
M.V.O.P. No.6/2022

Between :

సైపురెడ్డి త్రిమూర్తులు, తండ్రి : వెంకటస్వామి, వయస్సు, 56 సం॥, నివాసం : తూర్పు విప్పర్రు, ఇరగవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 534 320. ఫోన్ : 79896 63375. ...పిటిషనర్

మరియు

కొల్లి రఘాన్సీ మరియు 3 ఇతరులు, 1వ ప్రతివాది, కొల్లి రఘాన్సీ, భర్త : వెంకట రామయ్య, నివాసము : డోర్ నెం.3-164/2, బాపిరాజు గూడెం, పెదవేగి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 534 006.
(APS RTC అద్దె బస్సు ఒనర్-బస్సు నెం.AP 37 TE 6000) ...రెస్పాండెంట్స్

పై నెంబరు గల పిటిషన్ లోని పిటీషనర్ తనకు ప్రమాద భీమ సొమ్ము కొరకు పై కోర్టు లో పిటీషన్ దాఖలు చేయగా శ్రీ కోర్టు వారి ద్వారా 1వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు నోటీసు పంపించినను మీరు ఆ నోటీసును తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున మీకు పేపర్ పబ్లికేషన్ ద్వారా పంపించవలసినదిగా శ్రీ కోర్టు వారు ది.31-10-2023 నాడు ఆర్డర్ వేసియున్నారు. సదరు ఆర్డరు ప్రకారం మొదటి ప్రతివాది అయిన మీకు ఈ నోటీసు ద్వారా తెలియజేయనది ఏమనగా పై పిటీషన్ వాయిదా 20-12-2023 అయి ఉన్నది. కావున మొదటి ప్రతివాది అయిన మీరు ఆ రోజు ఉ॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరుగాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ సమాధానమును తెలుపవలసినదిగా కోరడమైనది. లేనియెడల మీ పరోక్షమున పై పిటీషన్‌ను తీర్మానించబడును.

వాయిదా తేది. 20-12-2023.

సి.హెచ్. శ్రీనివాస రావు,
ఎ.సువర్ణ,
పిటీషనరు తరుపు అడ్వకేట్స్,
తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా,
సెల్: 96760 28298, 94902 25090.

భూ వివాదాలు తొలగించి పేదలకు అందించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు వివాదంలో ఉన్నాయని, వీటిని పరిష్కరించి తక్షణం పేదలకు అందివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. పాలకోడేరు సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం మండల నాయకులు పాలా వెంకటస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భగా గోపాలన్ మాట్లాడుతూ మండలంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు వివాదంలో ఉన్నాయని తెలిపారు. నాలుగేళ్లు పూర్తవుతున్నా కనీసం పేదలకు ఇళ్ల స్థలాలు అందకపోవడం దారుణమన్నారు. పాలకోడేరు, విస్సాకోడరు, గొరగనముడి గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉండడం వల్ల వేలాది మంది ప్రజలు ఇల్లు నిర్మించుకోకుండా నిరీక్షిస్తున్నారని తెలిపారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకున్నవారికి బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. తక్షణం జిల్లా అధికారులు ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు సిపిఎం ప్రత్యామ్నాయం చూపుతుందన్నారు. ప్రజలపై వేసిన విద్యుత్ భారాలు ఉపసంహరించాలని, లేకపోతే మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహాన్ని నుంచి తప్పించుకోలేరన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేసుకోవటానికి పనులు లేక వలసలు వెళ్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, మండల నాయకులు దున్నా మరియమ్మ, తాడి రామారావు, కడలి అప్పారావు, కలిదిండి గోపాలరాజు, పసుపులేటి రంగారావు, వీరవల్లి వెంకటేశ్వరరావు, కోటికలపూడి శ్రీను పాల్గొన్నారు.

మొగల్తూరులో వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గ్రామాల్లో పక్క డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారిపై నిలిచిపోయింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

15న ప్రజారక్షణ భేరి

ప్రజాశక్తి - పోడూరు

ఈ నెల 15వ తేదీన విజయవాడ వేదికగా జరగనున్న ప్రజా రక్షణ భేరి విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అధ్వర్యంలో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ భేరి సభలో అందరూ పాల్గొనాలని కోరారు. పెంచిన విద్యుత్ బిల్లులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అంతర్‌జిల్లాల యోగా టోర్నమెంట్ ప్రారంభం

వీరవాసరం :వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే అంతర జిల్లాల యోగా పోటీలను డిఇఒ ఆర్.వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. అండర్-14, 17, 18 విభాగాల్లో నిర్వహించే యోగా టోర్నమెంట్, ఎంపికలకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 650 విద్యార్థులు పాల్గొన్నారు.

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 273/2020

Between:
Plaintiff: Bank of Baroda
(Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Kondeti Nageswara Rao and another

వాది తరుపున చేయించిన ప్రకటన

ప్రతివాదులు:
1. కొండేటి నాగేశ్వరరావు, S/o. పెద్ద వెంకన్న, హిందువు, పురుషుడు, 50 సం॥లు, డో.నెం. 18-2-10, బిసి ట్యాంకు వీధి, పాలకొల్లు.
2. వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, హిందువు, స్త్రీ, 40 సం॥లు, డో.నెం. 27-4-18, బిసి ట్యాంకు వీధి, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు ఆదేశముల ప్రకారము ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ మరియు ప॥గో॥జిల్లా, భీమవరం మండలం, భీమవరం నివాసి బొండా రామకృష్ణారావు, S/o. బొండా కృష్ణమూర్తి గారు నాకు తెలిపిన సంజాయిషీపై ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా,
నా క్లయింట్ ది. 26-12-2005 సం॥ తేదీన వారి తండ్రి గారైన కృష్ణమూర్తి గారి ద్వారా భీమవరం గ్రామంలో R.S. No. 398/7 లో 64.55 చ॥గ॥ స్థలాన్ని అందులోని బిల్డింగ్‌ని భీమవరం సబ్ రిజిష్టర్ ఆఫీస్‌లో రిజిస్టర్ నెంబర్ 7633/2005 గా దాన సెటిల్మెంట్ దస్తావేజు ద్వారా పొంది ఉన్నారు. సదరు దస్తావేజును నా క్లయింట్ ది. 20-10-2023 తేదీన షాప్ నుండి ఇంటికి తీసుకు వెళుతుండగా వెంకట్రామ టాకీస్ రోడ్డులో దస్తావేజు కవర్ పడిపోయినది. పైన వివరించిన ది. 26-12-2005 నాటి R.S. No. 398/7 స్థలం తాలూకు దస్తావేజు కవర్ ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు తెలియజేయగలరు. సదరు దస్తావేజు ఆస్తితో ఎవరైనా లావాదేవీలు జరిపిన యెడల అలాంటి లావాదేవీలు చట్ట ప్రకారం చెల్లనేరవు అని ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

మోగంటి శివకృష్ణ
అడ్వకేట్, భీమవరం
భీమవరం
ది.01-11-2023
సెల్:9848539039